పెద్ద కథ :

# ★ గడ్డిపూవు ★

## జరిగినకథ

శివాజీ రచయిత. అతని రూమ్‌మేటు నారాయణన్. అతను శివాజీకి ఒకరోజు తనతోటి గుమాస్తా రఘుచంద్రనీ, అతని భార్య రమణిని పరిచయం చేస్తాడు, ఆ దంపతుల అన్యోన్యం, రమణిచలాకీతనం శివాజీని ఆకర్షిస్తాయి. రమణి శీలంమంచిది కాదని నారాయణన్ శివాజీతో చెప్తాడు.

---

* [గత సంచిక తరువాయి]

2

రెండురోజులు యిట్టే గడిచిపోయేయి। రఘుచంద్రని కలుసుకోవాలని ఉరట పడింది మనస్సు। ఆనర్స్ చదువుకి తీరికంటూ ఎప్పుడూ వుండదు।-యూనివర్సిటీ క్లాక్ నాలుగుగంటలని చూపెడుతున్నది।

"రఘూ ఆఫీస్‌కి వెళ్లాలనుకొన్నాను। 'డబుల్ డెకర్' కుషన్‌సీట్‌పై హాయిగా కూర్చున్నాను। చిరుబురులాడుతూ శకరీ పేరియట్‌ముందు దించింది ఆ శకట రాజం।

"ఓహో ! యిలా దయచేశావేం?" నన్ను చూస్తూనే ప్రశ్నించేడు నారాయణన్।

"నిన్ను చూద్దామని అనిపించి...."

"నిజం। అయితేనీకు కాఫీ పోయించాలి। పద" అంటూ సీట్‌లోంచిలేచేడు।

"రఘుచంద్రని కలుసుకోవాలయ్యా।" అన్నా। నవ్వుతూ చూసేడు నన్ను।

"పదవెళ్దాం" యిద్దరం సాగిపోయేం। ఆప్యాయంగా ఆహ్వానించేడు రఘుచంద్ర।

"ఈనాటికి మీకు వీలు చిక్కిందన్న మాట" అడిగేడు। నవ్వేను।

"రోజూ వద్దామనే ప్రయత్నం। కాలేజీలో తీరికచిక్కక....।" ఆగేను।

"పదండయ్యా కాఫీకి।...." గొణిగేడు నారాయణ। క్యాంటీన్ కాఫీ తీయగా చక్కగా వుంది।

రచన :

మండా రామలింగస్వామి

సిగరెట్ వెలిగించటంతో మనసు ఊగిపోయింది ఉల్లాసంతో।

"టివోలీలో హిచ్‌కాక్ పిక్చరుంది.... పోదామా।" వాళ్ళిద్దరూ రిస్టువాచెస్ చూసుకొన్నారు।

"టైంవుందిలెండి।" అన్నా నవ్వుతూ।

"రావటానికి నా అభ్యంతరం ఏమీ లేదు। పోతే రమణికి తెలియచెయ్యాలిగా"

"వెళ్లి ఆమెకూడా వస్తారేమో అడుగుదాం" అన్నా లేచినిలబడుతూ।

ఆలోచనగా నన్ను చూసేడు రఘు। మౌనంగా సిగరెట్‌ని పీలుస్తూన్నాడు నారాయణ।

"సరే....పదండి।" అంటూ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌వేపు దారితీసేడు రఘు।

"మేమిక్కడ వుంటాము। మీరు లోనికి వెళ్ళిరండి" అన్నా బైటనిలుచుని।....రఘు లోనికి వెళ్ళేడు।

మరుక్షణంలో విసవిస లాడుతూబైటికి వచ్చింది రమణి।

"ఇక్కడిదాకా వచ్చి....నన్ను చూడకుండా వెళ్దాం అనుకుంటున్నారా" అంది నవ్వుతూ। ఆ నవ్వుకి ఆమె ఎఱ్ఱటిబుగ్గలు వింతగా సొట్టపడ్డాయి।

"మీరు పిక్చరుకి ఎలాగూ వస్తారుగా। అందుకని లోనికి రాలేదు" అన్నా। రఘుని పరిశీలనగా చూసిందామె।

"ఈరోజు ఆమెకి వేరేపని వుందట శివాజీ। రాలేనని అంటున్నది" ఆగేడాయన

"క్షమించండి శివాజీ। నాకు వేరే పని వుంది" నవ్వుతూ అంది।

"సరే....మనం పోదామయ్యా। ఆ కొనకి పోయేసరికి టైం సరిపోదు।" అన్నాడు నారాయణ।

"తిరిగి తమదర్శనం ఎప్పుడో?" అడిగిందామె।

"ఏమంటే మీ దంపతులిద్దరూ రేపు మాకు అతిథులుగా రావొచ్చుగా" అన్నా। రఘుచంద్ర నవ్వేడు।

"హోటల్ సాంబారుకూడు. తినాలని వుంది। తప్పక రేపురాత్రి వస్తాం।" అందామె।

నవ్వుకుంటూ దారిపట్టేం। ప్రభుత్వం వారి బస్సులకి కోపంజాస్తి। వొస్తేఒకట్టున పదిబస్సులు ఓదానివెంట మరోటి గొలుసు మాదిరి వస్తాయి। రాకపోతే గంటలకొలదీ అలకసాగిస్తాయి।

అతికష్టంమీద ఆరున్నరకి "టివోలీ" చేరేము। 'హౌస్‌ఫుల్' కొట్టొచ్చినట్టు కనపడింది। ఉసూరుమన్నాయి జీవాలు।

"చచ్చితిమిగదయ్యా! ఇప్పుడేందారి!" అడిగేడు నారాయణన్!

"ఇంకో పిక్చరుకి పోదాం" అన్నాడు రఘుచంద్ర!

"టైంలేదు కాదూ" అన్నా! మౌనంగా ముగ్గురం నిలుచున్నాం ఓ మూడు నిముషాలు!

"సర్లెండి! 'గార్డెన్'లో 'చాయ్' తాగి అలా 'టంక్ బండ్'కి పోదాం!" ప్రపోజ్ చేశాను,

నారాయణ! మేము....ముందుకి సాగిపోయేం మౌనంగా!

విశాలమైన మైదానంలో హుషారుగా రకరకాల 'గేమ్స్' ఆడుకొంటున్నారు యువకులు! విచిత్రమైన కేకలతో ఆ ప్రాంతం వింతగా మారుమోగింది! నవ్వుతూ ఆహ్వానించింది గార్డెన్ కేఫ్ పసందుగా చెంతచేరింది 'ఛాయ్'! నాలుగు గుక్కలు కడుపులోకి చేరగానే ఆత్మారాముడు హుషారుగా లేచి నిల్చున్నాడు.

సంధ్య చీకట్లు మెల్లమెల్లగా అలుముకొంటున్నాయి! (సంపూర్ణ) హైదరాబాద్ నగరం వింతవింత కాంతులతో మెరిసిపోతున్నది! 'హుస్సేన్‌సాగర్' నిర్మలంగా నిర్లిప్తంగా కాంతుల్ని వెదజల్లుతున్నది! చల్లటి పిల్లగాలులు మా శరీరాల్ని తాకి ముచ్చటలాడేయి. కోలాహలంగా సాగిపోతున్న బస్సులు 'టాంక్ బండ్'ని అదరకొడుతున్నాయి! ట్రాఫిక్ లైట్స్ వెలుగుతూ ఆరుతూ వింతవింత కాంతుల్ని వెదజల్లుతున్నాయి! రకరకాల జంటలు కేరింతాలు కొడుతు సాగిపోతున్నారు ఉల్లాసంతో! వంటరిగా పోతున్న అమ్మాయిల్ని చిలిపిగా ఏడిపిస్తూ వెంబడిస్తున్నారు రోమియోలు! రకరకాల చీరల్లో వింతవింత బ్లౌజుల్లో....పలురకాల పలుకులతో....ముసిముసినవ్వులు నవ్వుతూ-నక్షత్రాల్లా కనీ కనిపించనట్టు యిట్టేకనిపించి అట్టే మాయమవుతున్నారు యువతులు! ఈ హడావిడికి తనకి సంబంధం లేనట్టుకళ్లు మూసుకొంది హుస్సేన్‌సాగర్.

తీయగా సిగరెట్ పీల్చి హాయిగా చూసేను!

"పిక్చర్‌లో ఏముందయ్యా! ఈ దృశ్యాలూ....యీ వాతావరణం....హాయ్" అన్నాడు నారాయణ!

"ఈ దృశ్యాల్ని మీ మెదడులో దాచుకొని....ఓ చక్కని చిత్రణ చేయగలరు మీరు....ఏమంటారు" నన్ను చూస్తూ అడిగేడు, రఘుచంద్ర! చిన్నగా నవ్వేను!

"నేనూ ఓ కవినేనా రఘూజీ! నన్నేదో గొప్పగాచేసి మాట్లాడుతున్నారు"

"అలా అనకండి శివాజీ....! మీ రచనలో ఏదో మాధుర్యంవుంది! 'స్త్రీ'ని చిత్రించడంలో మీకు మంచి నేర్పు వుంది!

"ఈ కవికి స్త్రీలంటే భయం! అడదానికి అమడదూరంలోవుంటూ....ఏవేవో పిచ్చిఊహల్ని పేర్చుకొంటూ ప్రతీ స్త్రీని అమృతమూర్తిగా భావిస్తూ....చిత్రిస్తాడు! జీవితంలో తనదిగా చెప్పుకొనే ఓ స్త్రీతో పరిచయం అయేక....ఆ మూర్తిలో వున్న అంతర్ రూపాన్ని చూస్తేకాని....శివాజీకి కనువిప్పుకలగదు! స్త్రీని అతిగా గౌరవించే ఏపురుషుడుమాత్రం నిశ్చలంగాజీవించేడు" నారాయణన్ అన్నాడు దూరరిగా మూసుకుంటున్న మేఘాల్నిచూస్తు! రఘుచంద్ర అతనిని నవ్వుతూ చూసేడు!

"శివాజీ! నారాయణన్‌ని ఎలా అర్థం చేసుకోవాలో బోధపడటంలేదు! ప్రత్యేకంగా స్త్రీ జాతంటే ఓ ఏహ్యభావంతో, మాట్లాడుతాడు! పరిస్థితుల ప్రభావానికి ఎవరమూ అతీతులంకాము! స్త్రీహృదయం నవనీతం వంటిది నారాయణా! ఆ హృదయాన్ని సున్నితంగా వాడుకుంటూ....తనకి నచ్చిన రూపంలో చూసుకుంటూ-నడిపించు కోవటంలోనే వుంది పురుషుడి ప్రజ్ఞ!" అన్నాడాయన! అతని కళ్ళలోకి నిశితంగా చూసేను! నిర్మలంగా నవ్వుతూ జ్యోతుల్లా మెరుస్తున్నాయి!

"మంచీ-చెడూ" అన్నవాటికి 'స్త్రీ' 'పురుష' భేదం లేదు నారాయణా! 'కరుణ ప్రేమలతో' ఎన్నో ఉన్నత స్వభావాలతో అరని జ్యోతుల్లా ప్రకాశించే వ్యక్తుల్ని ఆ యిరుతెగల్లోనూ మనం చూస్తాం! అలాంటి వ్యక్తుల్ని నువ్వెప్పుడూ చూడలేదు!....కనీసం ఎవరు చెప్పగా వినలేదు! ఇలా యిరుతెగల మీదా మాటలు విసురుకోవటం మన సంఘంలో ఓ దురలవాటు" అగేడాయన! నన్ను చప్పగా చూసేడు నారాయణ!

"ఊహల్లో తేలిపోకు కవీ! నిత్యం యీ ప్రపంచంలో జరుగుతున్న సంఘటనల్ని నువ్వు కాదనగలవా! ఆడదాని హృదయాన్ని అర్థంచేసుకోవటం ఆ సృష్టికర్తకేనా వీలుపడలేదట కదూ! అంతలోతుగుండెగల స్త్రీ ఎంతటి దారుణకృత్యానికైనా వెనుకాడదు కదూ!"

సిగరెట్ వెలిగించి గుండెనిండా పొగ పీల్చేను!

"నిన్నుకాదని గెలవలేం నారాయణా! పోరబాట్లన్నవి అందరికీ సమానమే!....పోతే....మనదేశంలో మొదటినుండీ స్త్రీ జాతికి ప్రత్యేకమయిన విలువ లేకుండా పోయింది! ఆమె పురుషుడికి సేవచేస్తూ అతని యిచ్ఛలకి లోబడివుండే నౌకరుగా గుర్తింప బడింది! లేనిపోని అభాండాలు ఆమెకే అంటగట్ట బడ్డాయి! ఏ విధమైన స్వతంత్ర్యం అమెకి లేకుండా పోయింది. ఈ నవనాగరిక ప్రపంచంలో నీ లాంటి వాళ్లు యింకా యిలా మాట్లాడటంలో అర్థంలేదు" నవ్వుతూఅన్నాను! నారాయణ నన్ను చురచురా చూసేడు ఉక్రోషంతో!

"అవును....నా మాటల్లో అర్థం మీకు బోధపడదు!....కారణం! మీరేదో నవనాగరిక ప్రపంచంలో ముందడుగు వేస్తున్నామనిఅనుకోవడమే! స్త్రీకి స్వాతంత్ర్యం యిచ్చారు....! మీతో సమానంగా నిలిపేరు! ఆమె కోరికలకు అడ్డుచెప్పకుండా....పరిపూర్ణ స్వేచ్ఛయిచ్చేరు కానీ....ఆ స్వేచ్ఛని స్వతంత్ర్యాన్ని ఆమె ఎలా అర్థం చేసుకొంటున్నదో....ఎన్ని అక్రమమైన రూపాల్లో దాన్ని ప్రతిఫలింప జేస్తున్నదో మీరు ఆలోచించేరా? భర్తచాటున చేయ

కూడని పనులను చేస్తున్న స్త్రీలు లేరా?.... అలా వాళ్ళు ఎందుకుచేస్తున్నారు?....ఈ సంఘం వారిని ఎందుకు క్షమించాలి? పూర్వం వారిని క్షమించేవారా? "ఉద్రేకంలో అన్నాడు నారాయణన్. అతనిని దీర్ఘంగా చూసి దృష్టుల్ని మరలించుకొన్నాడు రఘు. అతని ముఖంలో ఏదో బాధ తొంగిచూసింది.

"ఆ ప్రశ్ననే నీకువేస్తే. ఏకపత్నీవ్రతులుగా వున్న పురుషులు ఎంతమంది. స్త్రీకివున్న కట్టుబాట్లు నిబంధనలు నీకు లేవా. ఏవిధంగా స్త్రీకన్నా నీవు అధికుడివి?" అడిగా

"పురుషుడు స్వేచ్ఛాజీవి శివాజీ. అతను స్త్రీలా కట్టుబాట్లకి లొంగివుండాల్సిన పని లేదు. అతని శీలాన్ని వేలెత్తి చూపినా నష్టంలేదు."

"ఆ ఆధిక్యత ఏమిటంటా." నవ్వుతూనే అడిగా. నారాయణ జవాబు దొరకక తటపటాయించేడు. రఘుచంద్ర పెద్దగా నవ్వేడు.

"ఆ ప్రశ్నకి జవాబు లేదు కదూ నారాయణా.....శివాజీ.... మీ విషయంలో ఒప్పందం కుదరడం కష్టం. 8 గం. దాటింది. మీ అయ్యర్ మీకోసం చూస్తూ వుంటాడుకదూ.....వెళ్దాం" అంటూ లేచి నిలబడ్డాడు రఘుచంద్ర.

మౌనంగా ముగ్గురం సాగిపోయేం ముందుకు. చల్లటిగాలి మృదువుగా శరీరాన్నితాకి వీడ్కోలు చెప్పింది. తార్ రోడ్ మీద బళ్లు సాఫీగా సాగిపోతున్నాయి' కొద్దిదూరంలో సిమెంట్ బల్లమీదకూర్చుని పెద్దగా నవ్వుతూ కేరింతలు కొడుతున్న ఓ జంటనుచూసి ఆగేడు నారాయణన్. మే మిద్దరం అతనిని నవ్వుతూ చూసి ఆ జంటవేపు దృష్టిసారించేం. తీయగా నవ్వుతున్నది ఆమె. ఆ నవ్వు ఎక్కడో విన్నట్టుంది. రఘుచంద్రముఖం చిన్నబోయింది. కోపంతో రక్తవర్ణాన్ని దాల్చింది. ఆ స్త్రీరూపాన్ని పరిశీలనగా చూసి తుళ్ళిపడ్డాను. ఆమె రమణి. శ్రీమతి రఘుచంద్ర. నారాయణన్ రఘుని ముందుకి నడిపించేడు. ఆలోచిస్తూ వారిని అనుసరించేను.........

"రఘుచంద్ర చాలాబాధ పడ్డాడు శివా" నిట్టూరుస్తూ బెడ్ మీద కూలబడ్డాడు నారాయణన్. సిగరెట్ వెలిగించి అతనిని చూశాను

"అతనేకాదు నారాయణా. నేనూ విచారిస్తున్నాను. ఆమెని ఎలా అర్థం చేసుకోవాలో బోధపడటంలేదు" అన్నాను. పెద్దగా నవ్వేడు. సీరియస్‌గా నన్ను చూసేడు.

"కళ్ళకి కనబడిన సత్యాన్ని కాదనలేవు శివా. ఆమె అతనిని అందచేసుకొని ఎన్నో అవినీతి పనులు చేస్తున్నది.... ఆమె పక్కనున్నది రాఘవ. మాకోర్లయ్యా ఆమెతో మరువలేని సంబంధంవుందతనికి. అంతా చెప్పేను.....ఎంతో బ్రతిమాలేను. నా మాటల్ని పెడచెవినిపెట్టేడు రఘు. మోసపోయేడు. ఆమెవలలో చిక్కేడు. కులట....ఎంతపాపం చేస్తున్నదో ఆలోచించకుండా వుంది. అతని హృదయం ఎంత బాధపడుతున్నదో? అతనిని చూస్తే ఏదోలా వుంటుంది:....కానీ అతనికి ఆమంటే యింకా నమ్మకమే. ఇంతకన్నా నిదర్శనం కావాలా? మనతో సినిమాకి రాలేనివ్యక్తి....సరసాలకి ప్రియునితో సాగిపోయింది. స్త్రీ.... ఆ జాతిని నమ్మితే ఫలితం యింతే...." ఆగేడు. ఆలోచనగా చూసేను.

నాపై వింతవింత ఆలోచనలు దాడి చేసేయి. రమణి రూపం నాట్యంచేసింది నాముందు. బరువుగా కళ్ళు మూసుకొన్నాను. టీపాయ్‌మీద "అనా" పకపకా నవ్వింది.

'అనా' కూడా స్త్రీయేగా....!!!

* * *

స్పుత్నిక్కులతో పోటీపడుతున్న యీ కాలంలో రోజులూ గంటలూ యిట్టేగడిచిపోతున్నాయి.

రఘుచంద్రనికలుసుకొని ఐదురోజులు దాటింది. అతనిని చూడటానికి ఏదో జంకుగావుంది. నన్నుచూసి ఏమనుకొంటాడో.....ఎంత సిగ్గుపడతాడో. గదిలో నిశ్శబ్దం తాండవం చేసింది. ఎప్పుడూ ఏవో ఊహల్లో తేలిపోయే నారాయణన్ కాంప్ వెళ్ళేడు. రోజులు గడవటమే కష్టంగా వుంది. శలవురోజు అసలేసాగదు. టైము చూసా. పసందుగా పదిగంటలు చూపుతున్నది. సిగరెట్ వెలిగించి తీయగా పీల్చాను.

మృదువుగా తలుపు తట్టినట్టయింది. తలుపు తెరచి ఆశ్చర్యపోయేను. నవ్వుతూ నిల్చుంది రమణి. ఎఱ్ఱటి సిల్కు చీర. నల్లటి వెల్వెట్ బ్లౌజ్....లిప్‌స్టిక్‌తో మెరుస్తున్న పెదాలు....మనోహరంగా వుంది. అంతలోనే తేరుకున్నాను.

దయచేయండి." నవ్వుతూ ఆహ్వానించా. సోఫాలో కూలబడిందామె గాజుల్ని పెద్దగా శబ్దంచేస్తూ.

"నారాయణన్ లేరా" తీయగా వుందా స్వరం. చురుక్కుమంది సిగరెట్.

"లేదండీ. మద్రాస్ వెళ్ళేడు "అన్నా.

"ఈ మధ్య రావటం మానేసేరే శివాజీ. "

"ఇప్పుడే అనుకుంటున్నా రమణిగారు. రఘుచంద్ర బాగున్నారా"

"ఆఁ....మీ గురించి యిద్దరం ఎదురు చూశాం....ఆఖరికి ఉండబట్టలేక యిలా వచ్చేసేను" అందామె పెద్దగా నవ్వుతూ.

"నాపై మీకు చాలాఅభిమానమే....."

"మీరన్నా మీ నవలలన్నా నాకు అదో విధమైన ఆప్యాయత శివాజీ." అంది నవ్వుల్లో రత్నాలొలికిస్తూ.

నాకళ్ళకి తనకళ్ళని కలిపి చిలిపిగా చూసింది. ఝల్లుమంది నా గుండె ఆ చూపుల్లో తీక్షణత....ఆరూపంలో రమణీయత ఎటువంటి గుండెల్నయినా యిట్టే అటలాడిస్తాయి.... .

అంత అందమయిన కథల్ని సృష్టించే మీచేయిని ముద్దుపెట్టుకోవాల్నుంది శివాజీ!" అంటూ నాచేయిని మృదువుగా నొక్కింది. నాలో రక్తం ఉవ్వెత్తున లేచింది. నానరాలు తీయగా మూలిగేయి. ఉద్రేకంతో వణికి పోయేను, పెద్దగా నవ్వింది రమణి! అదోలా నన్నుచూస్తూ సోఫాలో వాలింది. నా మనస్సు నన్ను చీదరించుకొంది. వెటకారంగా నన్ను చూస్తూ నవ్వింది నా హృదయం. లేచి కిటికీ దగ్గరగా వెళ్లేను! దూరంగా పోతున్న బస్సులు ప్రగల్భంగా నవ్వేయి నన్నుచూస్తూ .... అలా ఓ రెండు నిముషాలు నిల్చున్నాను....!

"ఇంతమంచిపుస్తకాన్ని మీ దగ్గరే అట్టి పెట్టుకుంటే ఎలా? వెనక్కి ప్రశ్నిస్తున్న ఆమెని పరీక్షగా చూసేను! ఆమెచేతిలో 'అనాకెరినీనా' 'అనా' 'రమణి' సరిపోయింది యిద్దరికి అనుకున్నా మనస్సులో! .... పుస్తకాన్ని విప్పుతూ మనోహరంగా నవ్వుకున్నదామె! అదేనవ్వు....! ఆనవ్వుని ఎదిరించే శక్తి లేదు ఏ పురుషుడికీ!

ఈ పుస్తకంపై మీ అభిప్రాయం" ప్రశ్నించిందామె! ఆమెని తదేకంగా చూసాను.

"....అంటే...." ఆగేను!

" 'అనాకెరినీనా' చాలా మంచిపుస్తకం కదూ! "

"పూర్తిగా చదవండి .... మీకే తెలుస్తుంది!"

"నేను చదివేను శివాజీ! అడుగుతున్నది మీ అభిప్రాయం!" అన్నదామె.

"రచన మంచిదే! కళ్ళకి కట్టినట్టు వ్రాసేడా మహనీయుడు! కాని....'అనా' మీ జాతికంతటికి అవమానంతెచ్చే స్త్రీ! అటువంటి స్త్రీలని మనసంఘం క్షమించదు! మన కట్టుబాట్లకీ....మన సంఘ నియమాలకీ అతీతంగా వుండే చిత్రిణ అది!" అన్నాను. నన్ను తీక్షణంగా చూసింది

" 'అనా' చేసిన తప్పేమిటో" ఆగింది! నవ్వేను,

"ఆమె చేసింది మీకు తప్పుగా కనిపించటంలేదుకదూ...."అన్నా.

"అవును! తనకునచ్చిన వాడిని ప్రేమించింది. పోతే ఆమెజీవితం అలా ముగియటానికి కారణం మీ మగజాతే! ''

"నిజమే! తనకి నచ్చిన వ్యక్తిని ప్రేమించింది!.... కానీ అతనిని అంతగా ప్రేమించిన వ్యక్తి తనలో వున్న స్వభావాన్ని కాదనలేక పోయింది. మనస్సులో నిగ్రహంలేదు. ఎటూ చెందని ఏదో వూహాలోకంలో విహరించింది, అందుకు ఫలితం అనుభవించింది.'' అన్నా సాఫీగా!

"మీరూ అలాఅంటే ఎలా శివాజీ! స్త్రీని అర్థంచేసుకోవటంలో వుంది! అంతే....!'' నవ్వేను! కోపంగా చూసిందామె!

''రమణిగారూ మీరు హిందూస్త్రీలు! మన సాంప్రదాయాల్లో మన కట్టుబాట్లలో తిరిగే మీరే ఆమెని ఎలా అభినందిస్తున్నారో అర్థం కాకుండావుంది!''

''....హిందూదేశం! సాంప్రదాయం! అన్ని సాంప్రదాయాలు స్త్రీలకేనా? తన యిచ్ఛప్రకారం నడిచే అధికారం ఆమెకి లేదూ''

"నన్ను అర్థం చేసుకోండి! స్త్రీజాతికి స్వతంత్ర్యం కావాలి! ఆ స్వతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి వారు! ఇష్టం లేని పురుషుడ్ని వివాహం చేసుకొని కాపురం చెయ్యమని కాదు నేను చెప్పేది! ప్రేమించినవాడిని పెళ్ళాడి అతనితో సుఖజీవనం గడపమనే నా అభిభాషణ! ఇటు పెళ్ళాడిన భర్తాకావాలి .... అటు ప్రేమించిన ప్రియుడూ కావాలంటే ఎలా? అప్పుడు ఆమెని ఎలాపిలవాలి!" ....నన్ను తీక్షణంగా చూసిందామె! ఆమె ముఖం కోపంతో ఎరుపెక్కింది! సిగరెట్ వెలిగించి "కాలింగ్‌బెల్" నొక్కేను!

"రమణిగారు! నన్ను క్షమించండి! మిమ్మల్ని కష్టపెట్టి నట్టున్నాను!"

"అదేం లేదండీ! అయినా యిదరం అర్థంలేని టాపిక్‌ని ఎత్తుకున్నాం! కాస్త కాఫీ పోయించండి చాలు!" అంది నవ్వుతూ! గదిలోనికి ప్రవేసించిన 'బాయ్' 'కాఫీ' శబ్దంవిని క్రిందికి పారిపోయేడు! మరుక్షణంలో వేడివేడి కాఫీ మా ముందు చేరింది

"రఘుచంద్రగారు కూడా రావాల్సింది" అన్నా!

"వారికి వంట్లో నలతగా వుందండీ! రాలేనన్నారు" అందామె కాఫీ సిప్ చేస్తూ! మౌనంగా ఆమెని చూసాను!

చేతివాచీ పన్నెండుగంటలు చూపుతున్నది!

"మిస్టర్ శివాజీ! నే వెళ్తాను! ఓ ఫ్రండ్ యింట్లో పార్టీవుంది! లంచ్‌కి పోవాలి!" అంటూ లేచింది!

"క్షమించండి! ఈ రోజు నాఅతిథులుగా వుండకూడదూ!" అడిగేను! నన్ను తీయగా చూసింది! నా చేయిని మృదువుగా తాకి ముద్దుపెట్టుకొంది!

"మీ అభిమానానికి థాంక్స్! కానీ రాఘవకి....అదే నా ఫ్రెండ్‌కి ప్రోమిస్ చేసా! సరా" అంటూ ముసిముసిగా నవ్వింది! మెల్లగాసాగిపోయిందిముందుకు! ఆమె వెళుతున్నవేపు మౌనంగా చూస్తూ నిల్చున్నాను! విచిత్రమైన వ్యక్తి! జీవితాన్ని ఆటబొమ్మగాతలచి ఆడుకొంటున్న అబల! చపలబుద్ధితో గాలిలో సౌధాల్ని నిర్మిస్తున్నస్త్రీ! మౌనంగా నిట్టూర్చింది నా హృదయం! సిగరెట్ 'ముద్దుతో' యీ లోకంలో పడ్డాను! ఈజీచైర్‌లో కూర్చుని 'అనాకెరినీనా'ని తిరగెయ్యబోయా! అగమన్నట్టు సౌంజ్ఞచేసింది" అనా, పుస్తకం లోంచి చిన్న కాగితం క్రిందకి జారింది! ఆశ్చర్యంగా చూసేను! మడతలు విప్పి చదివాను! నా గుండె ఆగినంత పనయింది!

"శివాజీ!

అందమయిన వస్తువుల్ని ఆరాధించటం నాకు సరదా. మీలో సౌకుమార్యం, మీ వర్చస్సు నన్ను ఆకర్షిస్తున్నాయి. "ఆరాధించడానికి అవకాశం యివ్వరా మీరు

(తరువాయి 28వ పేజీలో)

## గడ్డిపూవు

(18వ పేజీ తరువాయి)

కవులు కవిగా నన్నర్థం చేసుకొండి ముఖాముఖి చెప్పటానికి సిగ్గుపడియిలా తెలియజేస్తున్నాను.

నేను స్త్రీని.... స్త్రీ కోరికలకి అంతు లేదని ఓకథలో మీరు వ్రాసేరు. ఎంతగా స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకొని వ్రాసేరో !!!

స్త్రీ కోరికను కాదంటారా !

రమణి.

త్రుళ్ళిపడ్డాను . నా కళ్ళు సిగుతో మూతలుపడ్డాయి ! స్త్రీ .... స్త్రీ రూపం ర మ ణి! చపలత్వానికి మారుపేరు రమణి. యావత్ స్త్రీజాతికి మచ్చతెచ్చే వ్యక్తి రమణి ! మూతలుపడ్డ నాకళ్ళ లోంచి రెండు నీటిబిందువులు జారేయి. పిచ్చిగా అదోలాచూస్తూ నిలుచున్నాడు నాముందు రఘుచంద్ర!....కళ్ళువిప్పి చూసేను. అంతా భ్రమే! ఆలోచన లతో వళ్ళంతా చెమట పట్టింది! నారాయణన్ చెప్పినమాటలు గుర్తుకొచ్చేయ్ ఆనాడు నమ్మలేకపోయేను ఈనాడు కాదనటానికి సాహసంలేదు ! భర్త చాటున.... అంతటి విశాలహృదయుడిని అసరాగాతీసుకుని యింతటి నాటకాన్ని ఆడుతున్నది రమణి ! ముగ్ధత్వానికి సౌశీల్యానికి ఆలవాలమైన హైందవ స్త్రీ జాతిలో జన్మించిన స్త్రీయేనా యీ రమణి ! ఆలోచనలకి అడ్డులేకుండా పోయింది! మెదడు వేడెక్కిపోయింది! నీరసంగా కళ్ళు మూతలుపడ్డాయి! నిద్రాదేవత నన్ను కౌగలించుకొంది !....

(సశేషం)

## ప్రకటన

సత్తెనపల్లి డి॥ ము॥ కోర్టులో
Guntur D M. C. File
S C. 1131/60 E.P. 409/62

పుట్టి వెంకయ్య .... వాది
And
మేడా యల్లమంద వగైరా ప్రతివాద్లు

యీ దిగువ ప్రతివాదుల తాలూకు స్థిరాస్థిపై కోర్టువారివలన ది 18-3-63 తేదీన వేలంవేయబడును. కావలసిన వారు పాడుకొనవచ్చును.

గుంటూరు డి॥ అమరావతి సబు డి. చేరిన దిడుగు గ్రామంలోని

1. డి. నె 2రు E గుర్తు రు 6-11-0 శిస్తుగల య 3-82 ట్లలో య 0-51 సెంట్లకు హద్దులు :

తూ : మేడా సుబ్బయ్య, ద: నంది పాటి సూరయ్య, ప: డి. గోవిందరాజు భూమి, ఉ: డిటో.

యీ హద్దులలోని య 0-51 ట్లు శేరీ మెరక భూమిన్ని యిందులోని భావి సహా రు 510-00 లు.

E. C. దాఖలా ది 25-9-60 తేదీన సరిపూడి వెంకటప్పయ్యపేర ప్రతివాద్లు వ్రాయించి యిచ్చినట్లు చెప్పే అస్వాధీనపు తనఖా ప్రతిఫలం సూన్యమైనది. లాలూచీగా సృష్టింపబడినది చెల్లదు.

2. డిటో అమరావతి సబు డి॥ లింగాపురం గ్రామంలోని యిల్లుస్థలముకు హద్దులు :

తూ : దర్శి శేషయ్య వగయిరా
ద : గోవిందు నరసింహారావు,
ప : మేడా సుబ్బయ్య,
ఉ : సర్కారు పోరంబోక

యీమధ్య షుమారు 160 చ॥గ॥ల స్థలమున్నూ వంటిపిట్టాడి పూరియిల్లు కల్ప కప్పు యావద్విశిష్ట సామానుసహా కిమ్మతు రు 400-00 లు.

(సం.) యెల్లినేడి వెంకటేశ్వరరావు,
వాది త॥ అడ్వకేటు

## ప్రకటన

మహారాజశ్రీ కృష్ణాజిల్లా కోర్టులో
యస్టేట్సు యబాలిషన్ ట్రిబ్యునల్
E. P. 12/63

Between :
శీతంరాజు రామకృష్ణారావు పిటీషనరు
And
శీతంరాజు వాసుదేవరావు వగైరాలు
రెస్పాండెంట్లు

యీ నెంబరు పిటీషన్ రెస్పాండెంట్లకు నోటీసు నిమిత్తం పైకోర్టువారు ది 20-3-63 తేదీకి వాయిదా వేసినారు గాన రెస్పాండెంట్లకు ఆక్షేపణ యున్న యడల పై కోర్టులో హాజరై తెలియజేయగలందులకు యిందుమూలముగా తెలియజేయడ మైనది.

(సం.) డి. నారాయణరావు,
పిటీషనరు త॥ అడ్వకేటు.

—:o:—


వస్తోంది ! వస్తోంది !!
పాఠక లోకాన్ని ఉఱ్ఱూత లూగించిన
*సరస శృంగార కథల మాస పత్రిక*

జిలిజి

సంపాదకుడు : మణ్యాం

సినిమా విశేషాల్తో, విమర్శలతో
చక్కని ముఖచిత్రంతో
వెలువడుతోంది

వెల : 30 న. పై. మాత్రమే
ఏజంట్లు కావాలి
డిస్ట్రిబ్యూటర్సు :
విజయవాడ మార్కెట్ న్యూస్
కేదారేశ్వరపేట, విజయవాడ - 3